# మైనస్ ఇంటూ మైనస్

బి. శ్రీరామ్‌రెడ్డి




**లవకుశరావుకు** ఇంచుమించు ముప్పై ఏళ్ళకన్నా ఎక్కువ వయసుండదు. సహజంగా అందగాడే. కాని, అద్దంమాత్రం అతడిని అస్తమానూ వెక్కిరిస్తూనే ఉంటుంది. ఒక్కోసారి ఆ అద్దాన్ని బద్దలు కొట్టాలనిపిస్తుం దతనికి. కాని, మరో అద్దమైనా అతన్ని ముద్దుచేస్తుందా అంటే అదీ లేదు. పాత అద్దం పాటే దీనిదీను.

ఇంతకీ లవకుశరావును అద్దం అలా ఎందుకు వెక్కిరిస్తుందని మీ రడగొచ్చు. నేను చెప్పమా వచ్చు. మీలో ఎవరైనా అతడిని గనక చూసిఉంటే లేదా చూస్తే వోస్! ఇంతేనాఅని అద్దానికి వంత పలుకుతారు. లవకుశరావు ఇంటిపేరు ముగ్గుబుట్ట వారు. ఆ ఇంటి పేరు వారికెలా వచ్చిందోనని మనం పరిశోధించాల్సిన అవసరం గూడా లేదనుకుంటాను ఎందుకంటారా? లవకుశుని తండ్రి సహదేవరావు తల ముగ్గుబుట్టలా తెల్లగా నెరిసిపోయి నిగనిగ లాడుతుంటుంది. అలానే ఆ వంశం వా రందరూ పిన్న వయసులోనే తలలు పండించుకున్నారట. నిజానికి వారి ఇంటి పేరు ముగ్గుబుట్ట వారికి బదులుగా తల పండిన వారనే ఉండాలి కాని, ఆ వూరివాళ్ళు వాళ్ళ తలల్ని ముగ్గుబుట్టల్లా పోల్చుకుని ఉండవచ్చుననే అనుమానం ఉంది.

సహదేవరావు ఆ రోజుల్లో వో పిండి మరలో పన్జేస్తుండేవాడు. తెలియని వారందరూ అతని తలనిండా పిండి పేరుకుపోయిందేమో ననుకునేవారు. చిన్నప్పుడు లవకుశరావుగూడా తండ్రి తలనుచూసి అదే అనుమానం వేసేది. ఎన్నోమార్లు "నాన్నారూ! మీ తలనిండా పిండి ఉంది. దులిపేసుకోండి" అనేవాడు.

జవాబుగా తండ్రి నవ్వి వూరుకునేవాడు.

లవకుశుడికి పదిహేనేళ్ళ వయసొచ్చేసరికి అక్కడక్కడా వెంట్రుకలు నెరవడ మారంభించి పాతికేళ్ళకు పూర్తిగా పండిపోయింది. స్నేహితులు, సహాధ్యాయులు 'ముసిలోడా'అని పిలుస్తుంటే సిగ్గుతో తల వాల్చేసుకునేవాడు. పత్రికల్లో వస్తున్న తెలుపు వెంట్రుకల్ని నలుపుజేసే తైల ప్రకటనల్ని బాగా పరిశీలించి, కొన్ని తైలాన్ని వీపీలో తెప్పించుకుని వాడి చూశాడు. వాళ్ళూ వీళ్ళూ చెప్పిన చిట్కాలను వాడిచూశాడు. ఫలితం ఫలిత కేశాలు తప్ప వేరేమీ కనబడలేదు.

పాతికేళ్ళు రాగానే లవకుశుడి పెళ్ళి చేసెయ్యా లనుకున్నారు తల్లితండ్రులు. చిన్న వయసులోనే అతనితో మూడు ముళ్ళు వేయిస్తే ముచ్చటైన ముగ్గుబుట్ట వంశాంకురాలు వచ్చేస్తాయనే వారి ఆశ కాబోలు.

ఉద్యోగ ప్రయత్నంలో గూడా ఫేవ్ చేయనన్ని ఇంటర్వ్యూలను తన పెళ్ళి విషయంలో ఎదుర్కొనవలసి వచ్చేసరికి లవకుశరావుకి నిరాశా నిస్పృహాలు, ఒకవిధంగా జీవితం మీదే విరక్తి కలగసాగింది. అతని వయసు కేవలం పాతికేళ్ళంటే ఎవరూ నమ్మడంలేదు. ఏ అమ్మాయికూడాతాను పెళ్ళాడతానంటూ ముందుకు రావడం లేదు. చివరకు 'బర్త్ సర్టిఫికెట్' చూపించినా అదీబోగస్ అనే పరిస్థితి ఏర్పడింది. ఆడపిల్ల తల్లితండ్రులుకన్నా ఎక్కువ ఇదిగా బెంగపడిపోయారు అతని తల్లితండ్రులు. గడిచిన అయిదేళ్ళ కాలంలో ఎంత లేదన్నా వో ఏభై సంబంధాలు చూసి ఉంటాడు. వారందరూ మాకీ ముసలి సంబంధం అక్కరలేదని తిప్పికొట్టారు.

సహదేవరావు మిత్రు డొకాయన వో సంబంధం తెచ్చాడు. అమ్మాయి అపరంజి బొమ్మలా ఉంటుం దన్నాడు. మన అబ్బాయి మొదటి చూపులోనే లవ్వులో పడితీరతా డన్నాడు. అక్కడే ఉన్న లవకుశరావు వెంటనే అద్దం ముందుకు పరుగెత్తుకెళ్ళి 'అవునా!' న్నట్టు చూశాడు. అద్దం మళ్ళీ వికటాట్టహాసం చేసింది. అతడి తెల్లవెంట్రుకల్ని వేలెత్తి చూపింది. ముఖం ముడుచుకున్నాడు.

ఆ వచ్చి నాయన లవకుశరావుతో చిన్న సలహాను మెల్లగా సెలవిచ్చాడు. ఈ రోజుల్లో కావలసినన్ని హెయిర్ డైలు బజారులో లభ్యమవుతున్నాయి. తెలుపును నిమిషాల్లో నల్లగా మార్చవచ్చు నన్నాడు.

మనవాడి కిన్నాళ్ళకు ఆ సలహా నచ్చింది. డై చేయడం మినహా వేరే గత్యంతరం లేదు. వెంటనే బజారుకువెళ్ళి హెయిర్ డై తెచ్చి పట్టించాడు.

ఈ మారు లవకుశరావును చూసి అద్దం నవ్వ లేదు గదా, ముద్దెట్టుకుంది. అతని చేతికో చెరుకు విల్లు నిచ్చేసి 'ఇది ప్రేమ సామ్రాజ్యం. ఇది మన్మథ సామ్రాజ్యం' అని పాడుకోమంది.

● ● ● ●

ఫుల్ సూట్‌లో వీటుగా తయారై టీవిని ఒలకబోస్తూ, అభినవ మన్మథుడిలా వెలిగిపోతున్నాడు లవకుశుడు. ఆ పూర్లో పూల కరువు ఉండబట్టి సరిపోయింది. లేకపోతేనా...వాటి నన్నింటిని బాణాలుగా సంధించి వదిలేవాడేనేమో!

అమ్మాయి తండ్రి, మేనమామలు లవకుశరావును ఆయన తండ్రి సహదేవరావును సాదరంగా ఆహ్వానించి కావలసినంత మర్యాద చేశారు.

మనం అపరంజి బొమ్మ అనుకున్న అపరంజి స్వయంగా ఫలహారాల ప్లేటుతో వచ్చి, సహదేవరావుకు వినయంగా నమస్కరించి, 'హాయ్' అంటూ లవకుశరావును పలకరించింది.

ఆ అమ్మాయి 'హాయ్' అనగానే 'వాట్' అనుకుని ఆశ్చర్యంతో కాస్త తడబడి 'హెల్లో' అన్నాడు జవాబుగా.

"మా అమ్మాయి కాన్వెంటులో చదివిందిలెండి మన సంప్రదాయాలకన్నా దానిపాలు ఎక్కువ..." సమర్థించాడు మేనమామ.

'అవును—తెలుస్తూనే ఉంది' అన్నట్టు తల ఆడించాడు సహదేవరావు.

లవకుశరావు అపరంజిని నఖశిఖ పర్యంతం పరిశీలించాడు. బాబ్డ్ హేర్. లిప్‌స్టిక్ పెదాలు. నెయిల్ పాలిష్. 'హోహో! బ్యూటిఫుల్ డాల్' అనుకున్నాడు. వెంటనే హోకే హోకే అనుకుంటూ తలను ఎవరూ గమనించకుండా తడిమి చూసుకున్నాడు—తను వేసుకున్న హేర్ డై ఏమైనా వెలిసిపోయిందేమో నన్న అనుమానంతో, శ్రీ వెంకటేశ్వరుడి పటాన్ని బిగించిన ఫ్రేములోకి చూస్తూ కనీసం వీడైనా కనిపిస్తుందనే ఆశతో.

● ● ● ●

లవకుశరావు, అపరంజి భార్యాభర్తలైపోయారు. పెళ్ళయిన ఆ రాత్రికే వారిద్దరికో గదిని కేటాయించి, ఇదే మీ సామ్రాజ్యం అని చూపించారు పెద్దలు. అపరంజి అపర రతీదేవిలా ఆ గదిలోకి అడుగిడగానే, లవకుశరావు కుసుమాస్త్రుడై వెను వెంటనే వెళ్ళాడు. మత్తెక్కించే వాతావరణం. పూల సెజ్జ. హోహో! అనుకున్నాడు కొత్త పెళ్ళికొడుకు.

మంచం మీద కూర్చుని ఆప్యాయంగా చేతులు చాచి ఆహ్వానించాడు అపరంజిని, తన బాహువుల్లో బంధించడానికి.

సిగ్గు పడుతూనే మగడి నల్లుకుపోయింది మాధవీ



ఫోటో—డి. సుధీర్ బాబ్జీ

లతలా అపరంజి.

"ఐ లవ్ యూ, రంజీ! లవకుశుడు అన్నాడు" ఆవిడ లిప్‌స్టిక్ పెదాలలో దాగిన అమృతాన్ని జుర్రుకునే ప్రయత్నం చేస్తూ.

"ఐ లైక్ యూ టూ మచ్ లవ్వా" అంటూ మగని చాతీ వెంట్రుకల్ని సుతారంగా లాగసాగింది కితకితలు పెట్టడానికి.

"బాబ్డ్ హేర్ నీకు బలేగా నప్పింది సుమా! ఇంతటి అందగత్తె నా సొంత మవుతుం దనుకోలేదు. అంతా నా అదృష్టం!" పైకే అనేశాడు.

"మీ నల్లని గిరజాల జుట్టును చూసిన మరుక్షణంలోనే ఆనందంతో గిరికీలు కొట్టానంటే నమ్మండి" అంది ఆవిడ.

"పూర్వులు."

"నిట్టూర్పులు."

మరుల సిరులు పొంగి పొరలుతున్న ఆ సన్నివేశంలో అంతటా మన్మథావేశం.

లవకుశరావు భార్య జుట్టులోకి వేళ్ళు జొనిపి దువ్వుతూ నవరించసాగాడు.

ఆశ్చర్యం!

ఆ జుట్టు కూకటి వేళ్ళతో తడి మట్టిలో గడ్డిపెచ్చులా వూడొచ్చింది. అపరంజి ఇంకా తన్మయత్వంలోనే ఉంది.

అపరంజి బాబ్డ్ హేర్ లవకుశరావు చేతి వాటానికి అందిపోయింది.

అపరంజి తలమీది మూడొంతులు పలచగా జుట్టున్నా మిగతా భాగం నిగనిగలాడుతున్నది.

కళ్ళు బైర్లు కమ్మాయి అపర మన్మథుడు లవకుశరావుకు. ఒక అక్రందన లాంటిది చేసి మోసం, దగా అన్నాడు.

"కోడిగుడ్డు హెడ్డుదానా! నన్ను మభ్యపెట్టి ఎంతకాలం ఇలా నటిద్దా మనుకున్నావు? నీది బట్ట తల అని నాకు ముందే ఎందుకు చెప్పలేదు? ఇప్పుడు నేను తలమీద బట్ట వేసుకుని వెళ్ళిపోతాను" అంటూ ఛీత్కారం చేశాడు.

అపరంజి చెప్పలేని సిగ్గుతో, అవమానంతో కన్నీరు కార్చసాగింది. ఆ కన్నీరు కాలవలు కట్టి సెలయేరై పారేదేమోకాని, విపరీతమైన ఎండాకాలం కావడం మూలాన నేల రాలిన ప్రతి కన్నీటిబొట్టు ఆవిరై పోయింది.

"ఇంకా ఆ ఏడుపెందుకు? నేను చావకుండానే నీకు శాశ్వతంగా గుండు కొట్టేసిన ఆ భగవంతుడిని తిట్టుకోవాలి. ఇదంతా నా ప్రారబ్ధం! నా ఖర్మ" అన్నాడు నుదురు కొట్టుకుంటూ లవకుశరావు.

"నా తల నేను కోరుకుడు వల్ల అలా వూడిపోయిందండి. ఎంత ప్రయత్నించినా ఒత్తుగా జుట్టు పెరగలేదు. అందుమూలాన ఒక్క సంబంధంగూడా ఖాయం కాలేదండి. అందుచేత నా పెళ్ళి అయితీరాలంటే విగ్గుపెట్టి తీరాలని మా బంధువు ఒకాయన నచ్చచెప్పడంతో ఈ విగ్గును తయారు చేయించుకున్నాను. ఆ తరవాత పెళ్ళిచూపుల్లో మిమ్మల్ని గెలుచుకున్నాను. ఇక ఏలుకున్నా, ఏలుకోకపోయినా మీ ఇష్టం" అంది వెక్కిళ్ళ మధ్య నేలచూపులు చూస్తూ.

"జీవితంలో అందరికీ అన్నీ కోరిన విధంగా అమరవు. ఏదో ఒక వెలితి, ఏదో లొసుగు ఉంటుంటాయి—సర్దుకుపోవడమే జీవితం." జ్ఞానోదయం అయింది రావుకు.

లేచి అపరంజి దగ్గరకు వెళ్ళి విగ్గును ఆవిడ బట్టతలమీద ఉంచుతూ, "చూడు, రంజీ! ఇంకెప్పుడూ నిన్ను బాధపెట్టే మాట అనను. కాని పొరపాటున గూడా నీ బట్టతల నా కంట పడకుండా ఉండేలా చూడు" అన్నాడు ఆమె చుబుకాన్ని పట్టుకుని.

"నాది నల్లని నిగనిగలాడే జుట్టు అనుకున్నావుగాని, అదేం కాదు. అది ఎండుగడ్డిలా, గోగునారలా నెరిసిపోయిన జుట్టుమాత్రమే. నేనూ ఎన్నో సంబంధాలు చూసి అందరమ్మాయిలచేత రిజెక్ట్ చేయబడిన బాపతే. నిన్ను చూడ్డానికి వచ్చే నాటి నుండీ నా వెంట్రుకలకు రంగు పూయడం ప్రారంభించాను" అని తన రహస్యాన్ని గూడా దాచుకోకుండా చెప్పేశాడు.

"మైనస్ ఇంటూ మైనస్ ఏమవుతుందండీ!" అని ప్రశ్నించింది అపరంజి.

"ఏమవుతుంది?" అమాయకంగా అడిగాడు.

"మీ కిదిగూడా తెలియదా? ప్లస్ అవుతుంది" అంది అపరంజి.

"అవును—ప్లస్సే కదూ! ఏదీ—నువ్విటు రా" అంటూ అపరంజిని సందిట బంధించి "ఇలానే కదూ!" అన్నాడు.

"అవును."

"నీవూ మైనస్, నేనూ మైనస్. వెరసి మనిద్దరం ప్లస్. జీవితం ఫజిల్‌లో మనం కాకూడదు నస్."

పాన్పుమీది పువ్వులు నలిగిపోయాయి. ఆ గదిలో వాతావరణం మరింత మత్తెక్కించేలా తయారైంది. ✱